


ఆదివారం | 12 | మే | 2024 | పేజీలు : 4


# పోలింగ్ సిబ్బంది తుది దశ ర్యాండమైజేషన్ పూర్తి
## జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా




*భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, మే 11, ప్రజాజ్యోతి:*

జిల్లాలో జరిగే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది మరియు మైక్రో అబ్జర్వర్ల తుది దశ ర్యాండమైజేషన్ పూర్తి చేసామని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. శనివారం ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలో జరిగే పార్లమెంట్ ఎన్నికల సిబ్బంది రాండమైజేషన్ ఖమ్మం కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ సంజయ్ జి కోల్టే పరిశీలనలో ఎన్ ఐ సి వారు రూపొందించిన సాఫ్ట్వేర్ వినియోగిస్తూ ఆన్లైన్లో పోలింగ్ సిబ్బంది తుది దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా మాట్లాడుతూ జిల్లాలో కొత్తగూడెం, ఇల్లందు, పినపాక,భద్రాచలం మరియు అశ్వరావుపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1105 పోలింగ్ కేంద్రాలకు గాను 1105 బృందాలను కేటాయించడం జరిగింది అని తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం అదనంగా 20% సిబ్బందిని కేటాయించామని తెలిపారు. దీనితోపాటుగా మహిళా మరియు యూత్ పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక బృందాలను కేటాయించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు గాను 225 మంది మైక్రోఅబ్జర్వర్లను కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎలక్షన్ సెల్ సూపర్డెంట్ ధారా ప్రసాద్, రంగ ప్రసాద్ మరియు ఎన్ఐసీ డి ఐ ఓ సుశీల్,తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో నాలుగు గంటల వరకే పోలింగ్
### ఎన్నికల అధికారి ప్రియాంక అల

3లో



# ష్... గప్‌చుప్..



ముగిసిన ఎన్నికల ప్రచారం

జిల్లాలో నెల రోజులుగా హోరెత్తిన మైకులు

నినదించిన పార్టీల కార్యకర్తలు

ప్రశాంతంగా పల్లెలు, పట్టణాలు

ఇక ఓటరుదే నిర్ణయం

గుట్టుచప్పుడు కాకుండా తాయిలాల పంపకం

■ భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి

పార్లమెంట్ ఎన్నికల ప్రచారం ముగిసింది. పార్లమెంట్ అభ్యర్థుల ప్రకటనతో జిల్లా వ్యాప్తంగా నెలరోజులుగా బ్యాండు బాజాలతో.. మైకు హోరులతో ఆయా పార్టీలు ప్రచారం నిర్వహించాయి. పోలింగ్ తేదీ సమీపిస్తున్న కొద్ది తమ ప్రచార జోరును పెంచాయి. సభలు, సమావేశాలు, ఆత్మీయ సమ్మేళనాలు, ఇంటింటి ప్రచారాలతో అభ్యర్థులు ఓటరుకు చేరువయ్యే ప్రయత్నాలు చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు జరిగిన తమ పథకాలు అందిన సంక్షేమాలు సహా ఆయా ప్రాంతాలను బట్టి హామీలు గుప్పిస్తూ ముందుకు సాగారు. ఇక బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు సైతం అధికార పార్టీ వైఫల్యాలను ఎండగడుతూ మేనిఫెస్టోలు వివరిస్తూ ప్రచారాన్ని హోరెత్తించారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రచారాలు ముగియడంతో పల్లెలు, పట్టణాల్లో ప్రశాంతత కనిపించింది. ఇప్పటికే మరో పక్క గుట్టుచప్పుడు కాకుండా ప్రలోభాల పర్వం మొదలు...



# ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో 144 సెక్షన్ అమలు
## ఎస్పీ రోహిత్ రాజ్




*భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, మే 11, ప్రజాజ్యోతి:*

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా ఈ రోజు సాయంత్రం 4:00 గంటల నుండి 14.05.2024 సాయంత్రం 6:00 గంటల వరకు జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లాలో బహిరంగ సభలు,ర్యాలీలు నిషేధం ఉంటుందని పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ రోజున ఎవరూ కూడా పోలింగ్ కేంద్రాల చుట్టూ గుమిగూరాదని తెలిపారు. పోలింగ్ కేంద్రం నుండి 100 మీటర్ల హద్దును దాటి ఓటర్లు తప్ప ఎవ్వరు లోపలికి రాకూడదని సూచించారు. కావున జిల్లాలో ప్రజలు ఇట్టి విషయం పైన దృష్టి సారించి పోలీస్ అధికారులకు,సిబ్బందికి సహకరించాలని కోరారు. ఎవరైనా ఈ నియమ నిబంధనలను పాటించకుండా ఇబ్బందులకు గురిచేస్తే అట్టి వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోబాలకు గురి చేస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే సీ-విజిల్ యాప్ ద్వారా గానీ,డయల్ 100కి ఫోన్ చేసి గానీ దగ్గరలోని పోలీసు అధికారులకు గానీ సమాచారం అందించాలని ప్రజలను కోరారు. మన జిల్లాలో పోలింగ్ సమయం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే ఉంటుందని,ప్రజలంతా ఇట్టి విషయాన్ని గమనించి తమ ఓటు హక్కును వినియోగించుకుని పోలింగ్ శాతాన్ని పెంచాలని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల నియమావళి ప్రకారం 12 అంతరాష్ట్ర మరియు 04 అంతర్ జిల్లా చెక్పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. అక్రమంగా నగదు మద్యం మరియు మాదకద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో మొత్తం 971 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అందులో 146 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నాయని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు జిల్లాలో అన్ని రకాల భద్రతా ఏర్పాట్లను చేయడం జరిగిందన్నారు. చెక్ పోస్టుల ద్వారా మరియు జిల్లా పోలీసులు చేపట్టిన వివిధ తనిఖీలలో జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 1,33,18,381/-ల రూపాయల నగదును, రూ. 17,75,728/- ల విలువ గల 2696 లీటర్ల మద్యాన్ని, రూ. 2,06,85,300/-విలువ గల 828 కేజిల గంజాయిని,11,74,500/- రూపాయల విలువ చేసే బంగారు, వెండి వస్తువులను స్వాదీనం చేసుకోవడం జరిగిందని వివరించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుండి మొత్తం రూ. 3,69,53,909/- (మూడు కోట్ల అరవై తొమ్మిది లక్షల యాభై మూడు వేలు) లను స్వాదీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 660 కేసుల్లో 1082 మంది సమస్యాత్మక వ్యక్తులను బైండ్ ఓవర్ చేయడం జరిగిందన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకు వారిలో ఆత్మ స్థైర్యాన్ని నింపేందుకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో భద్రతా బలగాల చేత ఫ్లాగ్ మార్చ్ లను నిర్వహించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఓటు హక్కుపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల అధికారులతో సమన్వయం పాటిస్తూ సరిహద్దుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేయడం జరిగిందని తెలిపారు.

# బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు జిల్లాలో స్థానం లేదు

**- అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే పునరావృతం**

**- జన ఉత్సాహం రఘురాంరెడ్డి విజయోత్సవ ర్యాలీని తలపిస్తోంది**

**- కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**

**- మిత్రపక్షాల ఆధ్వర్యంలో పాల్వంచలో భారీ ర్యాలీ**



**పాల్వంచ, మే 11, ప్రజాజ్యోతి:**

సీపీఐ, సిపిఎం, టీజేఎస్ బలపరచిన ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డి విజయం కాంక్షిస్తూ శనివారం తొలుత జగన్నాధపురం వద్ద పెద్దమతల్లి ఆలయంలో ఎమ్మెల్యే కూనంనేని, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుమారుడు హర్ష రెడ్డి, మిత్రపక్షాల నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం మిత్రపక్షాల ఆధ్వర్యంలో పాల్వంచలో బస్టాండ్, రాజీవ్ గాంధీ మార్కెట్, శాస్త్రి రోడ్, అంబేద్కర్ సెంటర్, పాత పాల్వంచ మీదుగా నవభారత సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా పునరావత్వమవుతాయని అన్నారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు జిల్లాలో స్థానంలేదుని అన్నారు. రైతు కార్మిక వ్యతిరేక చట్టాలను పార్లమెంటు సాక్షిగా బిజెపి ప్రభుత్వం తెస్తుంటే పరోక్షంగా సహకరించిన బీఆర్ఎస్ కు ఓటేస్తే బిజెపికి వేసినట్లేనని ప్రజలు అప్రమత్తంగా ఈ దేశ ప్రయోజనాల కోసం అభివృద్ధి కోసం పాటుపడే ఇండియా కూటమి అభ్యర్థులకు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. జూన్ 4వ తారీఖున ఇండియా కూటమి అధికారం చేపట్టబోతుందని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఇండియా కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామసహాయం రఘురామ రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. జన ఉత్సహం చూస్తుంటే రఘురాంరెడ్డి విజయోత్సవ ర్యాలీని తలపిస్తోందిని, ఇదే ఉత్సాహంతో ప్రతి ఒక్క ఓటర్తో ఓటు వేయించే బాధ్యత మిత్రపక్షల కార్యకర్తలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా ఎస్ కే సాబీర్ పాష, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, టి పి సి సి సభ్యులు నాగ సీతారాములు, టీజేఎస్ జిల్లా నాయకులు శ్రీ మేధా శివ, సీపీఐ, కాంగ్రెస్, సీపీఎం నాయకులు ముత్యాల విశ్వనాథం అడుసుమల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, డీ సుధాకర్, ఎర్రంశెట్టి ముత్తయ్య, నూకల రంగారావు, కొండా వెంకన్న, బరపాటి వాసు, దొడ్డ రవికుమార్, కొండబోయిన వెంకన్న తదితరులు పాల్గొన్నారు.





## కాంగ్రెస్‌లో చేరిక లక్కినేని శ్యామ్




**టేకులపల్లి, మే 11, ప్రజాజ్యోతి:**

టేకులపల్లి బిఆర్ఎస్ పార్టీ పిఏసీఎస్ డైరెక్టర్ లక్కినేని శ్యామ్ బాబు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం ఇల్లందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా లక్కినేని శ్యామ్ బాబు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి పరిపాలన నచ్చి, పేద ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నందున మా గ్రామం అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కోరం సురేందర్, మండల అధ్యక్షుడు భూక్య దేవానాయక్, నాయకులు ఇది గణేష్, భూక్య సరోజ, దాంతోజు నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బలరాం నాయక్‌ను అత్యాధిక మెజార్టీతో గెలిపించాలి





**ఇల్లందు, మే 11, ప్రజాజ్యోతి:**

పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ కాంగ్రెస్ పార్టీ యంపి అభ్యర్థి పోరిక బలరాం నాయక్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టియంఆర్పిఎస్ యువసేన నియోజకవర్గ అధ్యక్షుడు పెరిక సురేష్ మాదిగ, టియంఆర్పిఎస్ ఇల్లందు మండల అధ్యక్షుడు వంగూరు కోటయ్య మాదిగలు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాం నాయక్ ను గెలిపించాలని టియంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ, టియంఆర్పిఎస్ జిల్లా అధ్యక్షుడు మేకల శ్యామ్ మాదిగ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమని పేర్కొన్నారు. మాదిగ, మాదిగ ఉప కులాలు కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు.

# మతోన్మాద బీజేపీని మిత్రపక్షాలను ఓడించండి

- ఇండియా కూటమి అభ్యర్థుల్ని గెలిపించండి
- సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ఇల్లందు డివిజన్ కార్యదర్శి ఈసం శంకర్
- సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ గుండాల మండల కార్యదర్శి కొమరం శాంతయ్య
- పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి వాంకుడోత్ అజయ్





**గుండాల, మే 11, ప్రజాజ్యోతి**

18వ లోక్ సభ ఎన్నికలు మే 13న జరుగుతున్న సందర్భంగా దేశ వ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీల ప్రచారం జోరందుకున్నదని అందులో భాగంగా సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) గుండాల మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కరపత్రాలు పంపిణీ చేస్తూ శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేతలు ఈసం శంకర్, కొమరం శాంతయ్య, వాంకు డోత్ అజయ్ లు మాట్లాడుతూ దేశం లో బిజెపి ఆర్ఎస్ఎస్ లు మెజారిటీ హిందూ మతోన్మాదంతో సమీకరణ చేస్తున్నారని అది అందరి ప్రజాస్వామిక హక్కులకు వ్యతిరేకమైనదని, ముస్లింలు, క్రిస్టియన్లు మాత్రమే దానికి శత్రువులు కాదు. హిందువులలో 80% దళిత, ఆదివాసి, పేద బలహీన వర్గాలకు వ్యతిరేకమైనదని దానికోసం వారిలో మెజార్టీ ఉన్మాదాన్ని, విద్వేషాగ్నిని, ఉద్వేగాన్ని కలిగిస్తుందని వారన్నారు. ఈ ఫాసిస్టు ప్రమాదం నుంచి దేశం బయటపడాలని, వందల సంవత్సరాల పాటు ప్రజాతంత్ర ఉద్యమాలతో పోరాడి సాధించుకున్న పరిమిత ప్రజాస్వామ్య హక్కులను ఇస్తున్న రాజ్యాంగాన్ని సైతం మోడీ ప్రభుత్వం రద్దు చేయ పూనుకుంటున్నదని వారన్నారు. అందుకే తెలంగాణలో జరగబోతున్న ఎన్నికలలో బిజెపిని టార్గెట్ గా చేసుకొని, ప్రజాస్వామిక, లౌకిక, శక్తులు దానిని ఓడించాలని కోరుతు న్నామని, ముక్కోణపు పోటీ ఉన్నచోట ఎవరు బిజెపిని ఓడించగలరో చూసి అంచనా వేసుకొని ఓటు వేయాల్సిం దిగా కోరుతున్నామన్నారు. విప్లవ శక్తులు స్వతంత్రంగా తమ పిలుపు లను అమలు చేస్తూ, మతోన్మాద ఫాసిస్టు బిజెపిని తాత్వికంగా, రాజకీయంగా, నిర్మాణపరంగా పోరా టం ద్వారా ఎదుర్కొని ఓడించాలని వారు కోరారు. వందల ఏళ్ల సహజీవన భారతాన్ని ప్రేమిద్దామని, మత విద్వేషాన్ని ఫాసిజాన్ని ఓడిద్దా మని వారు ఈ సందర్భంగా పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) డివిజన్, మండల నాయకులు పాయం వెంకన్న, కోదూరి జగన్, తెల్లం రాజు, సి. హెచ్ సతీష్, పూనెం మంగయ్య, ఈసం కృష్ణ, సనప కుమార్, దుగ్గి రాంబాబు, పూనెం లక్ష్మయ్య, మోకాళ్ళ ఆజాద్, కల్తీ రామన్న, మోకాళ్ళ పాపయ్య, ధారావత్ మోహన్, సనప కిశెంధర్, ధారావత్ ఆర్యా, పూకే శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో నాలుగు గంటల వరకే పోలింగ్

## ఎన్నికల అధికారి ప్రియాంక అల



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, మే 11, ప్రజాజ్యోతి:**

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో 11-05-2024 సాయంత్రం 4:00 గంటల వరకు పార్లమెంట్ ఎన్నికల ప్రచారం ముగుస్తుందని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. జిల్లాలో కొత్తగూడెం, ఇల్లందు, పినపాక, భద్రాచలం మరియు అశ్వరావుపేట నియోజకవర్గాల్లో 112 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు ఆమె తెలిపారు. జిల్లా లోని అన్ని నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. పార్లమెంటు ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ప్రకటనలో తెలిపారు.

# ఏరియా హాస్పిటల్ నర్సులను సన్మానించిన టీబీజీకేఎస్ నాయకులు



**మణుగూరు రూరల్, మే 11, ప్రజాజ్యోతి**

అంతర్జాతీయ నర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మణుగూరు సింగరేణి ఏరియా ప్రధాన ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తు సేవలు అందిస్తున్న 17 మందికి పైగా స్టాఫ్ నర్స్ లకు మణుగూరు ఏరియా టిబిజికెయస్ ఇన్చార్జి నాయకులు నాగెల్లి యూనియన్ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించి మిఠాయిలు అందించారు. మే 12 ఆదివారం సెలవు దినం కావడంతో ఒక రోజు ముందుగానే వారందరినీ హాస్పిటల్ ప్రాంగణంలో సమావేశ పరచి సత్కరించి వారి సేవలు కొనియాడారు. ఏరియా లోని కార్మిక వారి కుటుంబ సభ్యులకు నిష్పక్షపాతంగా విశేషమైన సేవలందించడమే కాకుండా వారిని అక్కున చేర్చుకుని మాతృమూర్తుల వలే సేవలు అందించి రోగాలను నయం చేస్తూ ఏరియా ఉత్పత్తి ఉత్పాదికతకు పరోక్షంగా సహకరిస్తున్న నర్స్ సేవలు ఎన్నటికీ మరువలేనివి మరపురానివని వారి త్యాగాలు ఎంత గొప్పవో కరోనా సమయంలో తేటతెల్లమైందని వారి సేవలకు వారంతా సెల్యూట్ చేస్తూ ప్రతి ఒక్కరికి నర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా టిబిజికెయస్ ఇన్ చార్జి నాయకులు నాగెల్లి, కూనవరం యం పి టి సి చిన్నక్క, నాయకులు ఇజ్రాయిల్, పాండు రంగయ్య పద్దం శ్రీనివాస్,, యర్రవు వినయ్, రేవన్, మరియు ఆసుపత్రి డాక్టర్ లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల ఆశీస్సులతో ప్రత్యామ్నాయ శక్తిగా "బీఎస్పీ"

- బహుజనవాదం గెలవకపోతే ప్రజాస్వామ్యం ప్రశ్నార్థకమే
- పెట్టుబడిదారులు కార్పొరేట్ వ్యక్తులకే కొమ్ముకాస్తున్న పార్టీలు
- బీఎస్పీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి యెర్రా కామేష్





**పాల్వంచ, మే 11, ప్రజాజ్యోతి:**

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు వారి బాగోగులను చూసుకుంటామంటూ ఆయా రాజకీయ పార్టీల నుంచి అభ్యర్థులు పోటీపడే వారిని, ముందుకు సాగే వారధిగా పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థులు పోటీపడేవారని, బీఎస్పీ పార్లమెంట్ అభ్యర్థి అడ్వకేట్ యెర్రా కామేష్ అన్నారు. శనివారం మండలంలోని దంతేలబోర, నారాయణరావు పేట, సంగం, నాగరం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ వ్యవస్థలోకి పెట్టుబడిదారులు కార్పొరేట్ శక్తులు ప్రవేశించి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలు తమకు నచ్చిన నాయకుడిని ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించుకునే సంస్కృతిని సాంప్రదాయాన్ని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బిజెపి, బీఆర్ఎస్ పార్టీలతో పాటు వారికి కావేడ్లు కూడా వంత పాడుతూ ముందుకు సాగడం విడ్డూరంగా ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మరీ ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బహుజన వాదం బలంగా వినిపించినందుకే అగ్రవర్ణ ఆధిపత్య పార్టీలు, వ్యక్తులు తమ తమ వ్యక్తిగత వైరాలను పక్కకు పెట్టి పార్టీ సిద్ధాంతాలను సైతం తుంగలో తొక్కి లోపాయి కారికంగా ఒప్పందాలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 90 శాతం ఉన్న అగ్రవర్ణ పేదలు, బీసీలు, దళిత, గిరిజన, మైనార్టీ వర్గాలు తమకు ఓటు వేసే యంత్రాలు గానే చూస్తూ ప్రధాన రాజకీయ పార్టీలు మనుగడ సాగిస్తున్నాయని ఆరోపించారు. ఎప్పుడైతే బహుజన వాదం ప్రజల్లోకి వెళ్తుందో అప్పుడు మాత్రమే ప్రశ్నించే తత్వం మొదలవుతుందని తెలిపారు. కాంగ్రెస్, బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు ప్రజాసేవను ఏ మాత్రం నమ్ముకోకుండా డబ్బు పరపతి ఆధారంగా ఆయా వ్యక్తులకు టికెట్లు ఇచ్చారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడం అంటే డబ్బున్న వారికి ఒక హక్కుగా మారిపోయిందని అన్నారు. ఈ విధానాన్ని రూపుమాపితే మాత్రమే అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. డబ్బులతో అండబలంతో ఓటర్లను కొనుగోలు చేసి ఓట్లు వేయించుకోవాలనుకునే ప్రతీ ఒక్కరికి ఈ ఎన్నికల ద్వారా గుణపాఠం చెప్పాలని హితవు పలికారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా బీఎస్పీ బలపడుతోందని అన్నారు. ముక్కు, ముఖం తెలియని వాళ్ళకు, కనీసం ఇప్పటివరకు ముఖం కూడా చూడని వాళ్ళకు ఓటు వేయకుండా నియోజకవర్గ ప్రజా సమస్యలపై నిరంతరం అలుపెరగని పోరాటం చేస్తున్న తన ఏనుగు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాయి, నాగేశ్వరరావు, తాటిపాముల హరికృష్ణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

# బలరాం నాయక్ వాహనం తనిఖీ



**టేకులపల్లి, మే 11, ప్రజాజ్యోతి:**

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని బొమ్మనపల్లి, కారకొండ రామవరం క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్ పోస్ట్ లో శనివారం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ వాహనాన్ని ఎస్ఎస్టి చెక్ పోస్ట్ అధికారి ఆధ్వర్యంలో పోలీస్, సిఆర్పిఎఫ్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అధికారులకు బలరాం నాయక్ సంపూర్ణంగా సహకరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది కృష్ణ ప్రసాద్, సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల సిబ్బందికి అవగాహన





**జూలూరుపాడు,మే 11,ప్రజాజ్యోతి**

జూలూరుపాడు మండలం పరిధిలోని ఆర్కే గార్డెన్స్ లో జరిగిన ఎన్నికల్లో అనుసరించాల్సిన విధివిధానాలపై పోలింగ్ సిబ్బందికి కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రెహమాన్ అవగాహన కల్పించారు. సమయపాలన, ఓటర్లతో ప్రవర్తించాల్సిన తీరు, సెల్ ఫోన్లు నిషేధం. అల్లర్లు జరగకుండా జాగ్రత్తలు బూత్ ల వద్ద అప్రమత్తం. ఎన్నికలు అయిన తర్వాత ఈవీఎంలను చేర్చేంతవరకు అప్రమత్తంగా ఉండాలనే తదితర విషయాలపై ఎన్నికల సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇంద్రసేనారెడ్డి తో పాటు ఎస్ఐ జీవన్ రాజ్ ,ఎన్నికల విధులలో పాల్గొనే పోలీస్ ఫారెస్ట్ సిబ్బంది హాజరయ్యారు.

# ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి : డీఎస్పీ రవీందర్ రెడ్డి




**మణుగూరు, మే 11,ప్రజాజ్యోతి**

13న జరగనున్న పార్లమెంట్ ఎలక్షన్స్ సందర్భంగా పినపాక అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లకు సంబంధించి ఎలక్షన్లకు నియమించిన సిబ్బంది తో మణుగూరు ఎస్డిపిఓ రవీందర్ రెడ్డి శనివారం స్థానిక హనుమాన్ ఫంక్షన్ హాల్ నందు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ పినపాక నియోజకవర్గం పరిధిలో ఎలక్షన్స్ నిమిత్తం 800 మంది సిబ్బందిని కేటాయించడం జరిగిందన్నారు. అలాగే ఎలక్షన్స్ కు సంబంధించి నియమ నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు సిబ్బందికి వివరించారు. ఎన్నికలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలోని గుండాల, అశ్వాపురం, మణుగూరు ఏడుల బయ్యారం, సిఐలు బూర్గంపాడు, కరకగూడెం, అశ్వాపురం, మణుగూరు ఎస్సైలు పాల్గొన్నారు.

# రామాలయం ఏఈవో సస్పెండ్

**భద్రాచలం, మే 11,ప్రజా జ్యోతి.**



భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఏ.ఈ.ఓ శ్రవణ్ కుమార్ ను విధులు నుండి సస్పెండ్ చేసినట్లుగా దేవస్థానం ఈఓ రమాదేవి శనివారం తెలిపారు. భద్రాద్రి రామయ్య దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న కాటేజీలకు హైదరాబాద్‌కు చెందిన అలివేలు ట్రస్ట్ నుండి భక్తులు ఇచ్చిన 15 లక్షల విరాళాలను ఎటువంటి రసీదులు ఇవ్వకుండా గోల్ మాల్ చేయడంలో ఏ.ఈ.ఓ శ్రవణ్ కుమార్ పాత్ర ఉండడంతో భక్తులు అతడి మీద ఫిర్యాదు మేరకు అతడిని సస్పెండ్ చేసినట్లుగా ఆమె తెలిపారు.

# ఎలక్షన్ వేళా 'గులాబీ'లో గుబులు ఒక్కొక్కరు దిగుతున్న కారు

**- కాంగ్రెస్ వైపు బీఆర్ఎస్ శ్రేణుల చూపు**

**- కారు పార్టీని ఖాళీ చేస్తున్న నవోదయ రెడ్డి**

**జూలూరుపాడు, మే 11,ప్రజాజ్యోతి**

పార్లమెంటు ఎన్నికల వేళా బీఆర్ఎస్ పార్టీకి షాక్ మీద షాక్‌లు తగులుతున్నాయి. ఒక్కొక్కరుగా కారు దిగుతున్నారు. వైరా నియోజకవర్గ పరిధిలో జూలూరు పాడు మండలం ఓటర్లు అన్ని పార్టీలకు ప్రధానమే. ఈ నేపథ్యంలో అధికారం కోల్పోయిన మూడు నెలల లోపే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఒక్కొక్కరుగా పార్టీని వీడి కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. జూలూరుపాడు మండల పరిధిలో కాకర్ల , పాపకొల్లు , అనంతరం, బేతలపాడు, అన్నారుపాడు , జూలూరుపాడు గ్రామపంచాయతీ లలో పెద్ద పంచాయతీలు ఉన్నాయి. తాజాగా గురువారం ఎంపీసీ



లావుడియా సోనీ , బొజ్జ తండా మాజీ సర్పంచ్ కిషన్ , సాయిరాం తండా సర్పంచ్ రోజా, కాకర్ల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ జిల్లా నాయకులు దొండపాటి వాసు , ముత్తినేని గోపి ఆధ్వర్యంలో 150 కుటుంబాలు జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. జూలూరుపాడు మండల లోని బీఆర్ఎస్ శ్రేణులు అధికార కాంగ్రెస్, చేరుతున్నారు. దీంతో స్థానిక నాయకత్వం అయోమయంలో పడింది. గడిచిన మూడు నెలలగా బీఆర్ఎస్ పెద్దగా కార్యక్రమాలను చేపట్టలేదు. అసెంబ్లీ ఎన్నికల ఓటమితో కోలుకోలేని ఆ పార్టీకి ప్రజాప్రతినిధులు, నాయకులు దూరమవడం మరో షాక్‌గా చెప్పవచ్చు. అసెంబ్లీ ఎన్నికల్లో బానోత్ మదన్ లాల్ ఓటమి తర్వాత ఆడపదడపా వచ్చిపోవడమే తప్పా, పార్టీకి పూర్తి సమయం కేటాయించలేదని బీఆర్ఎస్ శ్రేణులు వాపోతున్నారు. ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల సయమంలో బీఆర్ఎస్ నాయకులు స్తబ్దుగా ఉండడంతో నాయకులు, కార్యకర్తలు ఎవరిదారి వారు చూసుకుంటున్నామని వాపోతున్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు జూలూరుపాడు లో ఎన్నికల సభలను నిర్వహిస్తూ కార్యకర్తలు, నాయకులను ముందుకు నడిపిస్తున్నాయి. బీఆర్ఎస్ మాత్రం అభ్యర్థి గెలుపుకోసం ఎలాంటి సభలు, సమావేశాలు చేపట్టలేదు.



# ఎన్నికలను బహిష్కరిస్తున్నాం: గ్రామ ప్రజలు

**దుమ్ముగూడెం, మే 11,ప్రజా జ్యోతి.**

దుమ్ముగూడెం మండలం, అచ్యుతాపురం గ్రామ కోయ ఆదివాసులు ఏకతాటిగా ఒక్కటై సంచలన నిర్ణయం తీసుకోవడం జరిగినది. గ్రామంలో ఏళ్ల తరబడి మౌలిక సౌకర్యాలు అభివృద్ధికి నోచుకున్న పాపము లేదని, అధికారులు ఉండే మరియు ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధి ఉండే అడ్డ అయినటువంటి కూతంతా దూరంలో ఉన్న లక్ష్మీ నగరం నుండి అచ్యుతాపురం వరకు రోడ్డు సౌకర్యం సక్రమం లేదని,మరమ్మతులు చేపట్టడానికి ఆ యొక్క దారి గుండా కల్వర్టు శిధిల మై అస్తవ్యస్తంగా ప్రమాదకరంగా ఉన్నా కూడ ఇంతవరకు ఆ రోడ్డు విషయంపై స్పందించి పట్టించుకున్న నాధుడే లేడని మరియు అధికారులు పోలీస్ మండల రెవెన్యూ ఆఫీసుల ఎదుట ఉన్న చెరువు కలుషితంగా ఉండి కళ్ళ ముందు కనబడుతున్న పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు అని, అచ్యుతాపురం కోయ ఆదివాసి గ్రామస్తులను గ్రామ మౌలిక సదుపాయాలను చిన్నచూపు చూస్తున్న ప్రజా ప్రతినిధుల అధికారులకు బుద్ధి చెప్పాలనే ఉద్దేశ్యం తో, ప్రతి ఒక్కరు ఒకే మాటతో నిలబడాలని నిర్ణయించుకున్న గ్రామస్థులు.ఎన్నికల సమయం లో పూటకపు మాటలు చెప్పి, ప్రచారం చేసి, ఎలక్షన్లు అయిపోయిన తర్వాత పట్టించుకునే నాధుడు లేడని గ్రామస్తులు



వాపోయారు. సంవత్సరాల తరబడి మొత్తుకుంటున్న అచుతాపురం వెళ్ళు రహదారికి మోక్షం చూపటం లేదని ఆవేదన చెందారు. అంతేగాకుండా గంగోలు చెరువు వలన అచ్యుతాపురం ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఆ యొక్క చెరువులో కలుషితమైన రేగుబల్లి ఆశ్రమ పాఠశాలల నుండి వచ్చే వ్యర్థమైన నీళ్లు కలిసి పశువులకు, గ్రామస్తులకు అంటువ్యాధిగా దారితీస్తుందని మరియు అర్థవంతంగా ఆగిపోయిన అంగన్వాడి భవనాలను పూర్తి చేయకుండా అధికారులు ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం వహించారని, ఇటువంటి మౌలిక సౌకర్యాలు కల్పించకుండా ఈ రోజున ఓటు వేయమంటే మేము ఏ విధంగా ఓటు వేయాలని మండిపడ్డారు . కనుక ఈ యొక్క పార్లమెంటు ఎన్నికల్లో అచ్చుతాపూరం గ్రామ ఓటర్లు జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఓట్లు వేసే ప్రసక్తే లేదని కనుక పార్లమెంటు ఎన్నికల ఓట్లు బహిష్కరిస్తున్నామని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ కోయ ఆదివాసి పెద్దలు గ్రామ పటేల్ ఆదివార సంఘాలలో పనిచేసే నాయకులు కోయ ఆదివాసి యువతీ యువకులు కోయ ఆదివాసి మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ బైక్ ర్యాలీ

**-ప్రజలందరూ బీజేపీ వైపు చూస్తున్నారు**

**- బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్**

**జూలూరుపాడు,మే 11,ప్రజాజ్యోతి**

జూలూరుపాడు మండల వ్యాప్తంగా బిజెపి ఆధ్వర్యంలో బిజెపి పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద రావు గెలుపు కోసం బైక్ ర్యాలీ నిర్వహించారు , బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ మాట్లాడుతూ ప్రజలందరూ కూడా బిజెపి వైపు చూస్తున్నారు అని, మరోసారి మోడీ ప్రధాని కావాలని ప్రజలు కోరుకుంటున్నారని కావున , ఖమ్మం పార్లమెంట్ లో కూడా ప్రజలందరూ కూడా బిజెపి గెలిస్తేనే ఖమ్మం పార్లమెంట్ అభివృద్ధి అవుతుందని చెప్పి కోరుకుంటున్నారని ,రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సాధ్యం గాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిందని ,బిఆర్ఎస్ పార్టీ కూడా అన్ని రంగాలలో విఫలం అయిందని ప్రజలను మోసం చేసిందని, అవినీతిలో కూరక పోయినది దాన్ని ప్రజలు తిరస్కరించారని, బిజెపి పార్టీ నీతివంతమైన పార్టీని ప్రజలు కోరుకుంటున్నారని ,ఖమ్మం పార్లమెంటు బిజెపి అభ్యర్థి వినోద రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ విజ్ఞప్తి చేసినారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మాదినేని సతీష్, బిజెపి మండల అధ్యక్షులు సిరిపరపు ప్రసాద్, బిజెపి ప్రధాన కార్యదర్శి భూక్య రాజేష్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సాయి ,బిజెపి మండల కార్యదర్శి భూక్య రమేష్,బిజెపి గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు భూక్య రవి ,పూరేటి వెంకటేశ్వర్లు , సురేంద్రబాబు , రామకృష్ణ ,రాంబాబు ,గోపాలరావు, పుల్లారావు ,మరియు తెలుగుదేశం కార్యకర్తలు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు సాయి , బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

